

# అగ్రహారం కథలు

## వేదుల సుభద్ర



పేరులో ఒక రకమయిన రాజసాన్నీ, కొంత గాంభీర్యాన్నీ సంతరించుకుని ఆంధ్రదేశమంతటా ఉన్న చిన్న చిన్న గ్రామాలే అగ్రహారాలు. ఎదురెదురుగా చిన్నదీ, పెద్దదీ రెండు రాములవారి గుళ్ళూ, ఆ ఊరి దేవుడి కాళ్ళు నిత్యమూ కడుగుతూ అప్పుడప్పుడు వొద్దికగానూ, మరోప్పుడు కాస్త ఉగ్రంగానూ ప్రవహించే కౌశికగా పిలవబడే గోదావరి, వెనకే పచ్చదనాల నెచ్చెలులు వరిచేలూ, వాటికి కాపలాగా నిలుచున్న అన్నదమ్ముల్లాంటి కొబ్బరి చెట్లూ, ఇలా ఎంతో మనోహరంగా ఉన్న చోట ఎదురెదుగా రోడ్డుకిరువైపులా ఉన్న ఓ పాతిక ఇళ్ళని కలిపి ఒక ఊరుగా కట్టేస్తే అదే ఈ అగ్రహారం. అమ్మమ్మగారి ఊరు కావడమే కాకుండా, మరుగున పడుతున్న ఆచార వ్యవహారాలనీ, సంప్రదాయాలనీ, అనుబంధాలని మాకు రుచి చూపించింది కూడ అగ్రహారమే. చిలిపితనాల చిన్నతనాలూ, కలల అలల కౌమారాలూ, జీవితాన స్థిరపడే ప్రయత్నంలో ఉద్యోగాలూ, సద్యోగాలూ, పెళ్ళిళ్ళూ, పేరంటాలూ ఇలా రకరకాల మెట్లు ఎక్కుతూ దిగుతూ మధ్యలో ఎక్కడో, ఎప్పుడో తెలియకుండానే పారేసుకున్న అమ్మ పెట్టిన కమ్మనైన తాయిలం లాంటి ఆ ఊరి జ్ఞాపకాలు ఇవి. మన ఇంట్లోనో, పక్కనో కనిపించి పలకరించే వ్యక్తుల్లాంటివే ఈ కథల్లో పాత్రలు. కొన్ని జరిగినవి, కొన్ని నే విన్నవీ , వీటికి కొద్దిగా నా సొంత కవిత్వాల రంగులూ, వర్ణనలూ, ఊహలు అద్దేసి ఆ చేనే(రా)తల కలనేతకి నేను పెట్టుకున్న పేరు అగ్రహారపు కథలు. - *రచయిత్రి(బెంగుళూరు)*

# నందికేశుడు నవ్వాడు...

**వరాలమ్మగారు, విశాలాక్షమ్మగారు వదినా, మరదళ్ళు. విశాలాక్ష్మి భర్తకి అక్క వరాలమ్మగారు.** వరాలమ్మగారి అసలు పేరు వరలక్ష్మి, చిన్నప్పుడు వరాలు అని పిలిచే పేరు పెద్దయ్యాక వరాలమ్మగా స్థిరపడింది. ఇద్దరి ఇళ్ళకీ మధ్యన నాలుగే ఇళ్ళ దూరం. నిప్పుని కూడా కడిగి ఇంట్లో పెట్టుకునే ఆచారమూ, మడీ ఇద్దరికీనూ. దానికి తోడు ఎక్కడలేని చాదస్తమూ.. వయసులో పెద్దది అవడం వల్ల వరాలమ్మగారికి మరీనూ. ఆవిడ ఎంత చెప్తే అంత ఆవిడ తమ్ముడికి, మరదలికీనూ. అందుకే దాదాపు కుటుంబమంతా ఆవిడ మాట మీదే నడుస్తుంది- ఆవిడదీ, తమ్ముడిదీ కూడా.

వదినా, మరదళ్ళిద్దరూ ఎంతో స్నేహంగా ఉంటారు. ఇద్దరికీ వయసులో పదేళ్ళు తేడా ఉన్నా సరే కానీ ఒకరేం చేస్తే మరొకరు తప్పకుండా చెయ్యాలన్న ఆత్రం మాత్రం ఉంది ఇద్దరికీ. వారింట్లో బూడిద గుమ్మడికాయ వడియాలు పెడితే వీరింట్లోనూ పెట్టాలి. ఇక్కడ పిల్లకి బంగారం గొలుసు చేయిస్తే నాలుగు రోజుల్లో అక్కడా చేయించాలి. అలా అని అది విపరీతమైన వంతు వల్లో, విరోధం వల్లో వచ్చినది కాదు.. 'వదిన గారికి అన్నీ తెలుసనీ, అందుకే ఆ విడ చేసినవన్నీ మంచివని విశాలాక్ష్మి అనుకుంటే, మరదలు చిన్నది, తెలివైనది అందుకని ఆవిడ చేసేవన్నీ తనూ చేస్తే బావుంటుందని' వరాలమ్మగారు అనుకుంటుంది. అలా ఆరోగ్యకరమైన పోటీ మాత్రమే రెండిళ్ళ మధ్యా. దానివల్లే చాలా పనులు కలిసే చేస్తారు కూడా. పెళ్ళికైనా, పేరంటానికైనా, గుడికైనా ఇద్దరూ కలిసే వెళతారు.

వీరిద్దరికీ ఉన్న మరొక ఇష్టమైన వ్యాపకం, రకరకాల నోములూ, పూజలూ చెయ్యడం. ఇంచుమించుగా నెలకోసారో, మళ్ళీ మాట్లాడితే అంతకంటే తరచుగా వస్తూ ప్రజలని ఎప్పుడూ బిజీగా ఉంచే అలవాటైన పండగలు మహా వైభవంగా జరుపుకోవడం

మామూలే. అవి కాక ఎక్కడెక్కడినించో కనుక్కుని, తెలుసుకునీ మరీ కొత్త కొత్త పూజలూ, వ్రతాలూ, నోములూ చేస్తూ ఉండడం వాళ్ళిద్దరికీ భలే సరదా. ఆ పేరున నలుగురినీ పిలవడమూ, వారికి వాయనాలూ, భోజనాలూ పెట్టి సంతోష పెట్టడమూ అలవాటు. కొన్ని ఇద్దరూ కలిసి చేసుకుంటే, కొన్ని కొద్దిరోజుల తేడాలో విడివిడిగా చేసుకునేవారు. వీరి పుణ్యమా అని ఊరిలో వారికి నెలకి 'మూడు భోజనాలు, ఊరి ఆడవారికి ఆరు పేరంటాలూ'. 'వారింటో సందడే, సందడి నాలుగు రకాలు చేసుకోవాలనుకోవడం ఓ గొప్ప సరదా, సరదా ఉన్నంత మాత్రాన చాలా? అందరికీ సాగద్దూ?.. .. అదృష్టం వారిది' అనుకునేవారు ఊరివాళ్ళు.

ఏ పూజ అయినా, నోము అయినా సరే నాలుగువేళ్ళ వెడల్పు జరీ ఉన్న కంచి పట్టుచీరలు కట్టుకుని ఎంతో సందడిగా చేసుకునేవారు. అది, మాట్లడకుండా అందరికీ పసుపూ, కుంకాలు పంచే 'కైలాసగౌరి నోము' అయినా సరే, మహావైభవంగా చేసుకునే 'లక్షవత్తుల నోము' అయినా సరే, ఇద్దరికీ ఎప్పుడూ చెదిరిపోని ఉత్సాహం.

పదహారు ఫలాలు, మూగనోము, మోచేటి పద్మం, క్షీరాబ్ది ద్వాదశి, పువ్వు తాంబూలం, పండు తాంబూలం.. ఇలా ఒకటేమిటి? తమ పరిధిలో తమకు తెలిసిన నోములన్నీ చేసేసారు. శ్రావణమాసపు గౌరీవ్రతాలూ, అట్లతద్దీ, ఇలాంటి వాటి గురించి చెప్పక్కర్లేదు. 'ఫలానా వాళ్ళు చెప్పారు సంతోషిమాత వ్రతం చేద్దాం' అని ఒకరంటే, 'కేదారేశ్వర వ్రతం కూడా చేద్దాం 'అని ఇంకొకరు చెప్తారు. అలా ఒకరితో ఒకరు, ఒకరిని మించి మరొకరూ చేసేస్తూ ఉంటారు.

ఒకరోజు చుట్టపు చూపుగా వచ్చిన విశాలాక్షిగారి అమ్మ గారు మధ్యాహ్నం భోంచేసి నట్టింట్లో కొంగు పరుచుకుని నడుము వాల్చి, "అవునే విశాలీ, నందికేశుడి నోము చేసుకోరుటే? నువ్వూ, మీ వదినగారూనూ?" అంది. అంతే.. వెంటనే విశాలాక్షి వదినగారింటికి వెళ్ళి "వదినా! మనం ఇన్ని నోములు నోచాము కదా, మరి నందికేశుడి నోము పట్టద్దూ., ఎలా మర్చిపోయాం ఇన్నిరోజులూ? ఇవ్వాళ మా అమ్మ గుర్తు చేసేవరకూ"..అంది.

దానికావిడ "అవును సుమా! మర్చేపోయాను.. అయినా ఇప్పుడేమంత మించిపోయింది? వెంటనే పట్టేద్దాం, దానికేం మహాభాగ్యం?.." అంది. అలా అనుకున్నదే తడవుగా మొదలుపెట్టేశారు. అంతేకాదు, శనగలూ, అట్లూ, చిమ్మిలీ, పరమాన్నం, అప్పాలు ఇలాంటివన్నీ విజయవంతంగా పూర్తి చేసేసారు. అలా వారి నోముల కార్యక్రమం దిన దిన ప్రవర్ధమానంగా కొనసాగుతూ ఉంది.

విశాలాక్షి గారి కొడుకు వడుగు తలపెట్టారు మాఘమాసంలో. చాలా రోజులకి ఇంట్లో జరుగుతున్న శుభకార్యం కనక అందరినీ పిలిచారు. దూరప్రాంతాలలోనే కాక, అమెరికాలో ఉంటున్న విశాలక్షి గారి చిన్న చెల్లెలూ, కుటుంబమూ అందరూ వచ్చారు. ఇల్లంతా బంధుమిత్రులతో కళకళలాడిపోతోంది.

వడుగు మరో మూడు రోజుల్లో ఉందనగా అప్పుడొచ్చింది వరాలమ్మగారికీ ఆలోచన. వారిద్దరికీ నందికేశుడి నోములో మిగిలిపోయిన 'పెసరపుణుకులు' కూడా ఈ వడుగులో చేసేసుకుంటే ఆ తర్వాత ఉద్యాపన చేసేసుకోవచ్చు కదా, అని.

'పట్నాలలో ఉన్నవారికి ఈ పూజనీ చూపించినట్టు ఉంటూంది, అందరూ ఉండడంవల్ల సరుకూ తొందరగా చెల్లిపోతుంది' అని ఆవిడ ఆలోచన. 'ఇద్దరూ కలిసి చేసేసుకోవచ్చు, ఒకేసారి అయిపోతుంది' అని విశాలాక్షి గారు కూడా వదినని సమర్ధించింది. వడుగు రేపనగా చేసేసుకుంటే బావుంటుంది అని నిర్ణయించుకున్నారు.

ఆ రోజు రాత్రి అంకురార్పణ, తరవాత రోజు వడుగు. పూజకీ, ఫలహారాలకీ కావలసిన సరంజామా సమకూర్చుకోవడం, గురువుగారిని పిలవడం, ఇల్లంతా దులిపి, కడిగించడం, వగైరాలతో రోజంతా ఎలా గడిచిందో తెలియకుండానే గడిచిపోయింది.

ఒక్కొక్కరికీ ఐదు శేర్ల చొప్పున పది శేర్ల పెసరపప్పు నానబెట్టారు. ఇంచుమించుగా పదకొండు కిలోలదాకా ఉండవచ్చు అది ఇప్పటి లెక్కలప్రకారం. అది బాగా నాని మర్నాడు పూజ నాటికి పెద్ద గంగాళం నిండి పోయి, ఇంకో పెద్ద కళాయిలోకి కూడా నిండా

వచ్చింది. "అయ్యబాబోయ్, ఇంత పప్పేమిటి? పొరపాటున తలో పదిశేర్లు పోసేసామా? మన ఆత్రంలో" అని అనుమానం వచ్చింది వాళ్ళిద్దరికీ.

అది చూసేసరికి కొంచం భయం వేసినా, "ఆ.. చుట్టాలందరూ ఉన్నారు, ఊరివాళ్ళున్నారు, , చెల్లిపోతుంది" అని సమాధానం చెప్పుకున్నారు వదినా మరదళ్ళిద్దరూ. .

నందికేశుడి నోమంటే, చేసిన వంటంతా సూర్యాస్తమయం అయ్యేలోపల గడప దాటకుండా, బ్రాహ్మల కుటుంబాలు మాత్రమే భోంచేయాలి. అప్పుడే అది సలక్షణంగా పూర్తి అయినట్టు. లేకపోతే మళ్ళీ చేసుకోవాల్సి రావచ్చు.

తామిద్దరూ పూజలోనూ, వడుగు పనుల్లోనూ తీరిక లేకుండా ఉంటారు కనక ఇంట్లో వాళ్ళందరికీ ఫలహారాలు పెట్టి, నోమంతా సక్రమంగా పూర్తి చేయించే బాధ్యత నిర్వహించడానికి ఎప్పుడూ సరదాగా, చురుగ్గా ఉండే ఉండే వరాలమ్మగారి మూడో కూతురు పూర్ణనీ, విశాలాక్షి గారి పెద్దకోడలు ప్రమీలనీ ఎన్నుకున్నారు. ఉపనయనానికి వచ్చిన బంధువులు, ఇద్దరిళ్ళవాళ్ళు కలిపి దాదాపు అరవై మందిదాకా ఉన్నారు. ఎప్పటెప్పటివో కబుర్లూ, చిన్ననాటి సంగతులూ, ఊరిముచ్చట్లూ వీటన్నింటితోనూ ఇల్లంటా హోరెత్తిపోతోంది. పళ్ళెటూరిలో జరిగే ఏ వేడుకైనా ఎంతో సందడిగా ఉంటుంది. ఇప్పుడూ అంతే.

తెల్లవారుతూనే వచ్చారు, వంట బ్రాహ్మడు కామయ్యగారు. ఆయనకి తోడుగా వచ్చే ఆయన అక్కయ్య సుబ్బమ్మగారు. పెద్ద రుబ్బురోలు దగ్గర కూర్చుని చక చకా రుబ్బడం మొదలు పెట్టింది. దట్టంగా అల్లం, జీలకర్రా, కొత్తిమీరా, పచ్చిమిరపకాయలు వేసి మెత్తగా రుబ్బి మొదటి వాయ అన్నగారికి అందించింది.. ఆయన వేడి వేడిగా పుణుకులు వెయ్యడం మొదలు పెట్టాడు.

పూర్ణా, ప్రమీలా వచ్చిన చుట్టాలందరినీ "కాళ్ళు కడుక్కోండి, పెసర పుణుకులు తిందురు గాని, వేడి వేడిగా తయారుగా ఉన్నాయి" అని లేవదీసారు. అందరినీ వరసగా కూర్చోబెట్టి అరటి ఆకుల్లో వేడి వేడి పుణుకులూ, దానికి తోడు పుట్నాల పప్పు పచ్చడీ, కొబ్బరి పచ్చడీ కలిపి వడ్డించారు

తిన్నవాళ్ళందరూ 'అబ్బా! ఎన్నాళ్ళయిందో, ఇలాంటి పుణుకులు తిని. భలే ఉన్నాయి వేడివేడిగా, కారంగా అని, 'పిండి ఎంత మెత్తగా రుబ్బితే పుణుకులు అంత బాగా వస్తాయి అని మెచ్చుకుంటూ తిన్నారు. అక్కడితో ఆగకుండా 'వీటితో మజ్జిగ పులుసు పెడితే అమోఘంగా ఉంటుందని ఒకరూ, ఉల్లిపాయలూ, టమోటాలూ వేసి పల్చగా చింతపండు పులుసు పొంగించి అందులో వీటిని వేసి పులుసుని అన్నంలో కలుపుకుని తింటే ఇంకా బావుంటూంద'ని మరొకరూ, ఇలా సరదాగా కబుర్లు చెప్పుకున్నారు. మొదటిసారి కనక అందరూ ఉత్సాహంగా ఉన్నారు, తిన్నారు.

మెత్తగా రుబ్బినందుకు సుబ్బమ్మగారినీ, చక్కగా దోరగా వేయించినందుకు కామయ్యగారినీ మెచ్చుకున్నారు. నోము చేసుకుంటున్నవాళ్ళూ, పంపకానికొప్పుకున్నవాళ్ళూ మాత్రం 'అమ్మయ్యా! ఒక వంతు అయింది ఇప్పటికి. ఇలాగే మిగతా మూడు వంతులూ కూడా పూర్తి చెయ్యి' వ్రతం చెడకుండా ఫలం దక్కేలా చెయ్యమని నందికేశుడికి మనసులో దండం పెట్టుకున్నారు.

చేతివేళ్ళనించీ, మోచేతిదాకా కొబ్బరినూనె రాసుకుని చెయ్యి మర్దనా చేసుకుని తనూ నాలుగు పుణుకులు తిని, ఓ గంట గడిచాకా, మళ్ళీ పప్పు రుబ్బడం మొదలుపెట్టింది సుబ్బమ్మగారు. పదకొండు, పన్నెండుగంటలప్పుడు మళ్ళీ మరొక రెండు వాయలు వేసారు. మళ్ళీ అందరినీ పుణుకులు తినడానికి పిలిచారు. ఈ పూటకి ఇవే తినేసి, కొద్దిగా చారూ అన్నం, పెరుగన్నం తినేస్తే సరిపోతుందని నోము నోచుకున్నవారూ, వడ్డించేవారూ తీర్మానించారు.

రెండోసారి కొద్దిగా జోరు తగ్గినా, కడుపులో తిరుగుతున్న ఎలకలనీ, ఆకలని గోల పెడుతున్న ఆత్మారాముడినీ సమాధాన పరచడానికి పుణుకులకి న్యాయం చెయ్యడానికి కొందరు ప్రయత్నించారు. పొద్దున్న తిన్నవే ఇంకా అరగని వారు 'మా వల్ల కాదు, కొంచం

అన్నం పెట్టేయండన్నారు' అప్పుడే. 'తినగా తినగా గారెలు చేదని ఊరికే అన్నారా? మరి.' ఒక పక్కన వడుగు ప్రయత్నాలు, మరొక పక్క పుణుకులూ మహా జోరుగా సాగుతోంది హడావుడి.

ఒక గంటన్నర సేపు నడుం వాల్చిన సుబ్బమ్మగారు మళ్ళీ పప్పు రుబ్బడానికి ఉపక్రమించింది. అప్పటికి పుణుకుల మోజు తీరిన ఇంట్లో జనం ఆవిడని చూసి 'కర్ణుడు కవచకుండలాలతో పుట్టినట్టు ఈవిడ రుబ్బుడు పాత్రం పట్టుకుని పుట్టిందా? ఏవిటి?' అని అనుకున్నారు కొంత విసుగ్గా.

ఆ మాట ఆవిడతో అంటే.. అందులో వ్యంగ్యాన్ని గుర్తించని ఆ అమాయకురాలు " మరేన్రా!.. అందరూ అలాగే అంటారు. ఏవిటో చిన్నప్పటినించీ నాకు రుబ్బడమనా, విసరడమన్నా చాలా ఇష్టం. అసలు నేనూ మా చెల్లెలు, చెల్లాయమ్మా కలిసామంటే నాలుగు కుంచాల పప్పు రెండు గంటల్లో రుబ్బి పారేస్తాం" అంది తేలిగ్గా చప్పరిస్తూ. "ఇందాకా వాయలో కారం జీలకర్రా సరిపోయాయా? ఇంకొంచం వెయ్యమంటారా?" అని అడుగుతుంటే తలలు కొట్టుకున్నారు.

ఆవిడ మిషను రుబ్బినట్టు రుబ్బేయడమూ, కామయ్యగారు అలా అధాటుగా అలవోకగా పుణుకులూ చక చకా వేసేయడమూ చూస్తుండగానే జరిగిపోయాయి. క్షణాల్లో మాయాబజార్ సినిమాలో ఘారెలూ, బూరెలూ ప్రత్యక్షమైనట్టు మూడు, నాలుగు పెద్ద స్టీలు బేసినల నిండా పుణుకులు తయారయిపోయాయి. ' పెంరపుణుకులు ' అంటూ నిన్నంతా ఉత్సాహంగా గంతులేసిన పిల్లలు ఆ వైపుకి రావడమే మానేశారు.

అప్పటికి టైము మూడు అయింది. 'నందికేశుడి నోము ప్రసాదం తినడానికి రమ్మ'ని పిలిచిన ఊరివారందరూ మెల్లిమెల్లిగా రావడం మొదలు పెట్టారు. వాళ్ళందరికీ వడ్డనలూ, పలకరింపులూ అదో హడావుడి. 'వచ్చిన వాళ్ళు వస్తున్నారు, తిన్నవాళ్ళు తింటున్నారు, సరుకు చూస్తే అలాగే ఉంది, ఇంకా బుట్టల్లో పప్పు అలాగే ఉంది. ఇదంతా ఎప్పటికి పూర్తి అయ్యేను? 'అని మెల్లిగా బెంగ మొదలయింది.

ఇంట్లో జనమేమో, పుణుకులలో 'పు' అనగానే "తల్లీ, మాకు చాలు, అమ్మో మాకొద్దు" అనేస్తున్నారు. 'ఇప్పుడు వేసినవి పూర్తి అయితే మూడు వంతులు పప్పు పూర్తి అవుతుంది ఇంకా ఒక వంతు ఉండనే ఉంది దాన్నేం చెయ్యాలి?' సూర్యాస్తమయం అయ్యేలోపల అది కూడా పూర్తి అయిపోవాలి. అందరికీ అప్పుడు దిగులు పట్టుకుంది. ముఖ్యంగా విశాలాక్షిగారికీ, వరాలమ్మగారికీ.. 'ఇంత నోము నోచి, ఇది ఫలించకపోతేనో ?' అని దిగులు.

ఇద్దరు కుర్రాళ్ళని సైకిళ్ళు ఇచ్చి అగ్రహారం, పేరూరూ, కొంకాపల్లి స్కూళ్ళల్లోని బ్రాహ్మల పిల్లలందరినీ వెంటపెట్టుకొచ్చారు. వాళ్ళందరికీ దగ్గరుండీ ఆప్యాయంగా వడ్డించి తలో పావలా దక్షిణలిచ్చి మరీ పంపించారు. ఆడవాళ్ళకి తాంబూలాలూ అవీ. ఇదంతా పూర్తి అయ్యేసరికి నాలుగున్నర దాటింది. అప్పటికి అంకురార్పణకి ఏర్పాట్లు చెయ్యడానికి గురువు గారు వచ్చేసారు. దానితో ఒకటే హడావుడి.

'పప్పు రుబ్బడమే' తన జీవిత పరమావధి అన్నట్టు 'ఈ మిగిలినది మరో రెండు, మూడు వాయలవుతుందేమో , రుబ్బేయమంటారా అమ్మా?' అని సుబ్బమ్మగారు ఒకపక్కనా , 'ఈ పుణుకులు మా ప్రాణానికొచ్చాయి పిల్లలల విసుగూ, చిరాకులు మరొక పక్కనా ..ఈ మధ్యన ఏం చెయ్యాలా? ' అని ఆత్రం. మొత్తానికి కెలగాపులగంగా ఉంది ఇల్లంతా.

ఇంతలో వరాలమ్మగారి అత్తగారి చెల్లెలు "అయ్యో అంత కంగారు పడతారెందుకర్రా? సూర్యాస్తమయమయ్యే లోపల మనుషులు దొరక్కపోతే ఆవుకి పెట్టవచ్చు, గోమాత.. ఎంతో పుణ్యం.. నోముకి తప్పకుండా పనికివస్తుంది అన్నారు. "అమ్మయ్యా, ఈమాట చెప్పి ఈ పెద్దావిడ మా నెత్తిన పాలు పోసింది" అనుకున్నారు ప్రమీలా, పూర్ణా. "కానీ, ఆవులు"... అని వాళ్ళు ఏదో అనబోయేంతలో

"అయితే రుబ్బేయమంటారా ! పాపం ఆవులకి కారం అవుతుందేమో, పచ్చిమిరపకాయలు వెయ్యను లెండి.. ఎప్పుడూ ఉప్పూ కారం లేని గడ్డే కదా తింటాయి కదా! " అని సుబ్బమ్మగారు అందుకుంది.

అందరూ ఘొల్లున నవ్వారు ఆవిడ మాటలకి, 'ఈవిడ రుబ్బుడు గోల ఏమిటిరా బాబూ ? 'అని ముందు విసుగు వచ్చినా..

" అయ్యో నవ్వుతారేమ్రా? నేనేం తప్పు మాటన్నాను? పాపం నోరు లేని మూగజీవాలు.. వాటి ఆలనా, పాలనా మనమే కదా చూడాలి. " అంది ఆవిడ మరింత అమాయకంగానూ, ఉక్రోషంగానూ..

'ఇదిగో సుబ్బమ్మా, ఆవులకి పుణుకులూ, పచ్చళ్ళూ వేసి పెట్టక్కరలేదు తాటాకు బుట్టలో పెటి నానవేసిన పప్పు పెట్టేయవచ్చు, అవి తినేస్తాయి..' అన్నారు సలహా చెప్పిన మామ్మగారు.

ఆవిడా మాట అనడం ఆలస్యం.. పెరట్లోంచి నాలుగు ఆ వులని తులసమ్మ దగ్గరకి తీసుకొచ్చి, నూతి నీళ్ళ తోడి, వాటికి స్నానం చేయించి ముఖానికి పసుపూ, బొట్టూ పెట్టారు.

విశాలాక్షి, వరాలమ్మగార్లు. వాటి చుట్టూ మూడు ప్రదక్షిణాలు చేసి దండం పెట్టుకుని మిగిలిన పప్పుని నాలుగు తాటాలు బుట్టల్లోకి దేవి, భక్తిగా వాటి ముందు పెట్టారు. అంకురార్పణా, వడుగూ హడావుడి కాసేపు మర్చిపోయి ఇంటిల్లిపాదీ ఆ నాలుగు - ఆవుల చుట్టూ గుంపుగా, దడి కట్టి ఏదో సినిమా షూటింగ్ చూసినట్టు చూడడం మొదలు పెట్టారు.

పట్నాలనించి వచ్చిన చుట్టాలకి, వారి పిల్లలకీ మరీ విచిత్రంగా ఉంది ఈ తంతు. " గోవు మాలక్ష్మికీ కోటి దండాలు, అన్నట్టు కోటి దండాలు పెట్టాము, 'అమ్మా గోమాతల్లారా, శ్రీమహాలక్ష్మల్లారా, మా పాలిటకోరిన వరాలనిచ్చే కామధేనువులై ఈ ఫలహారం కానివ్వండి" అని దండాలు పెట్టారు, వరాలమ్మగారు, విశాలాక్షిగారు

మొదట ఆ ఫలహారానికీ, ఈ ప్రజల తీరుకీ కొద్దిగా బెదిరినా ఆ ధేనువులు వారిద్దరినీ కరుణించి మెల్లిగా తినడడం మొదలు పెట్టాయి.

'వాటికి కూడా ఇంట్లో వారిలాగే మధ్యలో బోర్ కొట్టేస్తే?' అన్న భయం ఒక పక్కనా, ఇవి పూర్తిగా తినకపోతే, ఆవు ముట్టిన పప్పుతో మళ్ళీ ఇంకేమీ చెయ్యలేం కదా? అన్న బెంగ మరొక పక్కా పీడిస్తుండగా, భయపడుతున్న నోము నోచుకున్నవాళ్ళిద్దరినీ కరుణించి, పాపం వారికి వరప్రదానం చేసినట్టుగా ఆ నాలుగు గోమాతాలూ తాపీగా 'పెసరపప్పు' ఫలహారం ముగించాయి.

ఆ కార్యక్రమం పూర్తి అయ్యేసరికి పొద్దున్నించీ డ్యూటీ చేసి అలసిపోయిన సూర్య భగవానుడు వీళ్ళందరి తలలమీదుగా వెనక్కి పాక్కుంటూ సెలవు తీసుకున్నాడు. అప్పటివరకూ ఊపిరి బిగపట్టుకుని కూర్చున్న వదినా మరదళ్ళిద్దరూ హాయిగా ఊపిరి పీల్చుకున్నారు.

" ఆవులకి కొంచం వెల్లుల్లిపాయా, ఇంగువా నూరి పెట్టమనండి కాపుతో, లేకపోతే పెసరపప్పుకి కడుపు ఉబ్బితే కష్టం. పొద్దున్న పాలివ్వవు సరికదా, ఫెడేలున తన్నినా తంతాయి" అని సలహా చెప్పారు ఆవుకి పెడితే పనికొస్తుందన్న మామ్మగారు.

" మాకు కూడా అలాంటి చిట్కా ఏదైనా చెప్పు మామ్మా " అన్నారు అప్పటికే పుణుకులు కడుపులో పని చూపుతున్న ఇంటివాళ్ళు.

" ఏముంద్రా, కొంచం వామూ, జీలకర్రా బుగ్గన పెట్టుకుని నీరు మింగుతూ ఉండండి, ఎక్కడి కడుపు నొప్పి అక్కడికి పారిపోతుంది. అన్నారావిడ నవ్వుతూ.

"అమ్మయ్యా, తలపెట్టినందుకు పని పూర్తి అయ్యింది, దేవుడి దయవల్ల" అనుకున్నారు మిగిలిన పూజ పూర్తి చేస్తూ..

"నా చేత్తో ఎప్పుడు పప్పు రుబ్బినా వంట పూర్తిగ చెల్లుబడి అవ్వడం తప్ప మిగలడమన్న మాటే లేదు "అని సుబ్బమ్మగారు చెప్పుకుంది గొప్పగా. అంతేకాదు, రాత్రి భోజనంలోకి పచ్చడి రుబ్బడం మొదలుపెట్టేసింది కూడా.

ఆర్భాటంగా అంకురార్పణ ఏర్పాట్లు మొదలయ్యాయి. వెంటనే..

పదివీశెల పెసరపుణుకులు నోము పేరిట వేయించుకుని తను ఒక్కటీ తినకుండానే అందరికీ పెట్టి, వదినా మరదళ్ళని వ్రతభంగం కాకుండా కాపాడిన నందికేశుడు మాత్రం ముసిముసిగా నవ్వాడు ఈ ప్రహసనాన్ని చూసి.

**Click here to share your comments on this article**